# ఎంకరటాంకర జ...

## చిలుకూరి దేవపుత్ర

సాయంత్రపు ఎండ ఏటవాలుగా బోగీలో కిటికీ పక్కనే కూచున్న నా మీద పడుతోంది. చలికాలం. అవడంవల్ల ఎండలో దాదాపు వేడిమి లేదు. అయినా ఈ మాత్రం వేడిని కూడా సహించలేకపోతున్నా-మా వారిని తలుచుకుంటూ వుంటే నాకు రక్తపోటు విపరీతంగా పెరిగిపోతోంది.

ఓ పక్షం రోజులు పుట్టింట్లో రెస్టు తీసుకుందామని నేను వెళ్తే పట్టుమని పది రోజులన్నా పూర్తికాకనే ఇంటి నుంచి ఉత్తరం-"అమ్మా! నువ్వు వెంటనే రాకపోతే నాన్న 'ప్రకృతి వైద్యం'తో మా ప్రాణాలు పూర్తిగా తోడేస్తారు" అని. అందుకే వెంటనే ఇలా ఈ రైలు ప్రయాణం!

మా వారికి కాస్త తీరుబడి దొరికిందా ఏదో ఓ 'ఉపద్రవం' సృష్టించాలని ప్రయత్నిస్తుంటారు. ప్రస్తుతపు ఉపద్రవమే 'ప్రకృతి వైద్యం'!

అసలు వారివని ఏం లాభం? నేను పుట్టింటికి వెళ్ళేటప్పుడే అమ్మాయిలిద్దర్నీ తీసుకు వెళ్ళాల్సింది-ఆ పిల్లలు నా మాట విని ఛస్తేరా ఏమన్నావా? వాళ్ళ నాన్నకంటే రెండాకులు ఎక్కువ చదివినట్టు పోజు పెట్టి చదువులు దెబ్బతింటాయన్నారు.

"ఏమండీ! తల చాలా నొప్పిగా వుంది" అంది నా ఎదురుగా కూర్చున్నావిడ-భర్తతో.

వాళ్ళిద్దరూ మంచి జంట అనిపిస్తోంది. అతనికి ముప్పయ్యి, ఆమెకి ఇరవయ్యేనిమిది సంవత్సరాలు వుంటాయి. వాళ్ళ ఒక్కగా నొక్క సంతానమేమో ఐదేళ్ళ అబ్బాయి ఆమె ఒళ్ళో నిద్రబోతున్నాడు.

"తల నొప్పేగా పోతుందిలే ఏం చేస్తుంది?" అన్నాడతను చాలా మామూలుగా...

"మీరెప్పుడూ ఇంతే...ఏ జబ్బు వచ్చినా మీ దగ్గరున్న దివ్య ఔషధం. 'ఏం చేస్తుంది' అన్నదేగా... రాత్రి 'జ్వరం వచ్చింది' అని చెబితే ఇదేమాటే అన్నారు. డాక్టరుకి చూపిద్దాం-మందులు ఇప్పిద్దాం అని అంటాం...శరీర తత్వం తెల్సిన వైద్యులు ఏమంటారో తెలుసా 'జ్వరం' అన్నది వచ్చిందంటే శరీరం విశ్రాంతి కోరుతూంది అని తెలపడమట. అందువల్ల బాగా మంచినీళ్ళు తాగుతూ రెస్టు యివ్వడమే మనం చేయాల్సిందల్లా" అంటూ అతనలా చెబుతోంటే అదేదో గొప్ప సందేశాన్ని నాకూ, మానవాళికీ అందిస్తోన్న ప్రవక్తలా అనిపించేడు.

"హూ-చాల్లెండి...రోగాలొస్తే మీలాగ ఉపన్యాసాన్ని మందుగా యిచ్చి బాగుచేయటం ఎవరికైనా చేతనవుతుందా?" అంటూ ఈసడింపుగా మెల్లగా అంది-గొణుగుతున్నట్టు.

నాకాక్షణంలో ఆమె రాక్షసిలాగూ, అతను దేవుడు లాగూ కనిపించేరు.

అలా కనిపించడానికి కారణం మావారే!

ఇంట్లో ఎవరికైనా ఏ కాస్త జలుబు చేసిందా? వెంటనే ఏ అలోపతి మెడిసన్ కోల్డరిన్నో, ఏ హోమియోపతి మందు 'ఇపికా'నో వాడందే ఊరుకోరు మావారు.

పొరపాటున నా చిటికెన వేలు వెన్ముటుక నాసి అంత తెగిందా చాలు-ఒకటే కంగారుపడిపోయి 'ధనుర్వాతాన్ని నిరోధించే ఇంజెక్షన్ చేయించాల్సిందే-బత్తాయి పండంత సైజులో బేండేజి మీద తీరాల్సిందే!

ఎంత ఘోరమైన పొరపాటు నయినా సహిస్తారు కానీ మావారు-రోగమొస్తే డాక్టరు దగ్గరకి వెళ్ళకుంటే ఏమాత్రం సహించరు.

అతి చిన్నగా తలనొప్పి వచ్చినా ఇంట్లో చెప్పుకోనంటే భయం!...డాక్టర్లకీ, మెడిసిన్లకీ ఓ యాభై ఖర్చు పెట్టందే నిద్రపోరు-అదీ ఆయన స్వభావం.

అలాంటి మావారిని చూసి- ఇతన్ని చూస్తోంటే దేవుడిలా కాక ఇంకెలా కనిపిస్తాడు ఎవరికైనా!

రైలాగింది...

హమ్మయ్యా...అనంతపురం వచ్చేసింది!

సూట్‌కేసు తీసుకుని నెమ్మదిగా దిగేను.

రైలు, స్టేషన్‌లో ఆగితే ఎంత సందడిగా వుండాలో అంత సందడీ వుంది. మా వారు వచ్చి వుండరని నా గట్టి నమ్మకం. అయినా ఆశతోటి వెదికేను.

నాకు ఎదురుగా వస్తోన్నాడో మనిషి-అచ్చం మా వారి లానే వున్నాడు. 'ఏమండీ'! అనబోయి తమాయించుకున్నాను. అతనొచ్చి నా చెంత నిలబడ్డాడు ఎవరికోసమో! మా వారికీ, ఈ మనిషికీ తేడా ఏమిటంటే మా వారు కొంచం లావు...ఈ మనిషి సన్నం...మొహం అంతా పీక్కుపోయి 'ప్రేతకళ' ఉట్టిపడుతోంది.

అతను నన్ను చూస్తూ నిలబడ్డాడు-

"భగవాన్! నేను మా వారేమోనని భ్రమ పడ్డట్టు ఈ మనిషి నన్ను తన పెళ్ళాంగా భ్రమ పడలేదు కదా!"

'ప్రేతకళ' మనిషి నవ్వేడు-

నేను నవ్వలేదు-నాకు మండుతోంది ఆ నవ్వు చూస్తోంటే...

నా సూట్‌కేస్‌ని చేతిలోంచి 'టపీ'మని లాక్కొని హడావిడిగా వెళ్ళిపోతున్నారు. అరక్షణంలో నేను తేరుకొని, కోపం తెచ్చుకొని "ఎవరయ్యా! నువ్వు నా సూట్‌కేసు..." అని అనబోయి మాటలు అంత దూరం స్టేషన్ గోలలో వినిపించవని జ్ఞానోదయమై వడివడిగా అడుగులు వేసేను.

స్టేషన్ బయటికి వచ్చేసేను...

'ప్రేతకళ' మనిషి అక్కడున్నాడు!

"ఏమిటీ అఘాయిత్యం" అన్నాను కోపంతో.

"ఊరికే ఉన్న ప్రాణానికి ఉరి పెట్టుకోటం' అంటారే-సరిగ్గా అలాంటిదే మా వారి తత్వం!

ఆయన ఒక్కరే ఉరిపెట్టుకుంటే ఏదోలే అని తప్పించడానికి ప్రయత్నించే అవకాశముంటుంది. ఊహూ...అలా కాదు. ఎదుటి వాళ్ళ తలల్ని కూడా ఇరికించాలని ప్రయత్నిస్తారు. అక్కడే వస్తుంది చిక్కంతాను.

ఏవాడూ తోచదు మీకసలు!" అంది జీరబోతున్న గొంతుతో.

నేను వారి నేపు చూడని దానిలా కిటికీ గుండా ఎటో చూస్తూ వుండిపోయేను.

"ఎందుకే అంత ఖదవుతావు...జ్వరం ఎందుకొస్తుందసలు? శరీరం పాడవుతోందన్నమాట...అప్పుడు ఆ పాడంతా బయటకు వచ్చేయడాన్నే 'జ్వరం'

అతని చేతిలోని సూట్‌కేసుని వదిలి గుండేసుకున్నాను.

"ఏం దుర్గా! అఘాయిత్యం ఏమిటే?" అన్నాడు 'ప్రేతకళ' మనిషి. ఆ కంఠం అచ్చం మావారిదే!


"ఏ...ఏమండీ...మా...మా...మీరు... మీరేనా?" అన్నాను తడబడుతూ.

"అవునే ముద్దుమొహమా! కట్టుకున్న మొగుణ్ణి గుర్తుపట్టలేవూ?" అంటూ నవ్వుతున్నారు. ఎడారిలో వెన్నెల్లా వుందా నవ్వు.

అప్పుడు పోలికలు వెదుక్కుని మావారేనని మరీ దృఢపరుచుకుని-"ఇదేమిటండీ ఇలాగయిపోయేరు? మరీ అరవై లంఘనాలు చేసిన వారిలా...ఏమయింది మీకూ...ఏ విషజ్వరమో రాలేదుకదా?" అంటూ

"ఇప్పుడు చెప్పండి!" అన్నాను.

"దానికో కారణముందోయ్! మొన్న నా ఫ్రెండ్ ప్రసాదరావు వచ్చేడు. వాడు ఓ నెల కిందట బెంగుళూరు వెళ్ళి అక్కడ ప్రకృతి వైద్యం వంట పట్టించుకుని వచ్చేడు. ఆ ప్రకృతి వైద్యం నాకూ నచ్చింది. ఎలాగూ బెంగుళూరు వెళ్ళేంత తీరిక లేదు కాబట్టి వాడి ద్వారా తెలుసుకున్న వైద్యాన్ని ఇంప్లిమెంట్ చేసేను. అంతే! ఇలాగయిపోయేను. అయినా ఈ వారం రోజుల్లో నేను తిన్నది ఏమున్నది గనుక...ఉదయం లేస్తూనే ఉడకేసిన ఆపిల్ పండు ఒకటి...మధ్యాహ్నం ఓ గ్లాసుడు పాలు, సాయంత్రం ఓ ఉడకేసిన బంగాళ దుంప!" అంటూ ఆయన చెబుతూంటే నాకు మూర్ఛ వచ్చినంత పనయ్యింది!




డగ్గుత్తికతో అరిచేను. అనలు బావురుమని ఆయన భుజం మీద వాలి ఏడ్చేద్దామనిపిస్తోంది-అక్కడ రద్దీ లేకపోయుంటే!

మా వారు అచ్చంగా 'భట్టి విక్రమార్క' సినిమాలోని భేతాళుడిలా నవ్వేరు. ఆ నవ్వు అలా వుండటంలో ఆయన తప్పేముంది? ఆ ముఖంలో ప్రేతకళ వుందాయె మరి!

"ఏమండీ...మాట్లాడరూ...ఆ నవ్వడమేమిటి?" అన్నాను చిరుకోపం ప్రదర్శిస్తూ.

"నాకేమయిందే పిచ్చిదానా!" అన్నారాయన నిశ్చలంగా.

"మరి మీరిలా?"

"ముందు వెళ్దాం...పదా...ఆటోలో వెళ్తూ మాటాడుకుందాం!" ఇద్దరం ఆటోలో బయల్దేరాం...

"ఇప్పటికే మన ఇంట్లో అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం వాడుతూనే వున్నాం కదా... మరీ ఈ ప్రకృతి వైద్యం ఎందుకండీ!" అన్నాను కాస్త విసుగ్గా.

"ఏ వైద్యమైనా మానవ శ్రేయస్సుకేగా-అందుకే ప్రకృతి వైద్యాన్ని ఇంప్లిమెంటు చేయటం!"

ఇంకేం మాటాడాలో తోచక మౌనంగా వుండి పోయేను. మళ్ళీ మావారే అన్నారు — "ఇప్పుడు ఇంట్లో అందరూ వెరీ డిసిప్లిన్ తెల్సా? చెప్పడమెందుకులే నువ్వే చూస్తావుగా!" ప్రేతకళ మొహంలో గర్వ రేఖని వెలిగిస్తూ!

ఇంటి దగ్గర నన్ను దింపేసి 'ఇప్పుడే వస్తా'నని చెప్పేసి ఎక్కడికో ఆటోలోనే వెళ్లిపోయేరు.

ఇంట్లోకి అడుగుపెడుతున్నట్టే మా రెండో అమ్మాయి సులక్షణ, మూడవ అమ్మాయి సుగుణ నన్ను కావిలించేసుకుని బావురుమన్నారు. తమ పరిస్థితి చాలా దారుణంగా వుందంటూ ఒకటే ఏడ్చేయేరు. ఎముకల గూళ్ళుగా అయిపోయిన పిల్లల్ని చూస్తోంటే నా కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లేయి!

"కాస్త వివరంగా చెప్పండర్రా!" అన్నాను - వాళ్ళ తల్నీ నిమురుతూ.

"మునుపటిలా లేదే మన ఇంటి వ్యవహారం అంతా మారిపోయింది... పొద్దున్నే ఇంత కాఫీ, టిఫిన్ చేసే వాళ్ళమా? ఇప్పుడలా కాదమ్మా! ఏకంగా పది గంటలకి భోజనం చేసేయడమే!..."

అని సుగుణ అంటూవుండగానే సులక్షణ అందుకుంది — "ఆకలేస్తోంది గదా అని గబగబా తినేయకూడదట... నెమ్మది నెమ్మదిగా ఒక్కో ముద్ద నమిలీ, నమిలీ మింగాలట... నాన్న దానికో మంత్రం చెబుతాడే — "ద్రవ పదార్థాలని నమలాలట, ఘన పదార్థాలని తాగాలట?..."

వెంటనే సుగుణ అంది — "తిన్నంతసేపూ నీళ్ళు తాగరాదట. తిన్న తర్వాత ఓ గంట గడిచాక రెండు లీటర్ల నీళ్ళు తాగాలట... పాపం! అలా చేసినందుకు అక్కయ్యకి ఓసారి వాంతి అయ్యిందే... అయినా నాన్న వదల్లేదు... ఇక సాయంత్రం అయిదు గంటల వరకూ మధ్యలో ఏమీ తినరాదుట... ఐదింటికి మళ్ళీ 'నమిలీ, నమిలీ' భోజనం చేయడం..."

వాళ్ళలా చెబుతోంటే నాకు మూర్ఛ వచ్చినంత పనయింది!

"అలాగా - అయ్యొయ్యో!" అన్నాను అప్రయత్నంగా.

"అప్పుడే 'అయ్యొయ్యో' అంటే ఎలాగే... ఇంకా చెప్పవలసింది ఎంత వుందనుకున్నావ్... వేపుళ్ళు చేసి భోజనంలో నంచుకోగూడదట... అందులో విటమినులూ అవీ నశిస్తాయట... పచ్చి కూరగాయల్ని కొరుకుని తినేయాలట... అసలు మనిషికి ఇలా వండుకు తినడం అన్నది అసహజమైన ఆహారమట..." అంటూ పిల్లలిద్దరూ డగ్గుత్తికతో చెబుతుంటే ఎంత రాతి గుండె అయినా ఎలా వుంటుంది కరగకుండా! అందునా కన్నతల్లి నైతిని!!

రాత్రి పడుకోబోయే ముందు ఆయన పక్కనే కూచుని అన్నాను — "మీరిలా చేయడం ఏం బావులేదు!"

"ఏం చేశానే దుర్గా!" అన్నాడు, హిట్లర్ వేషంలో వున్న చార్లీచాప్లిన్‌లా మొహం పెట్టి.

"మీ ప్రకృతి వైద్యంతో పిల్లలిద్దరూ పాడలెత్తి పోయారు... పెద్దమ్మాయి పెళ్ళయి పోయింది కాబట్టి బతికిపోయింది... అసలు మీ విషయమే తీసుకోండి దూలంలా వున్న మనిషి పూచిక పుల్లలా అయిపోయేరు." అంటూ నాందీ ప్రస్తావనగా అన్నాను.

మా వారేం తక్కువ తిన్నవారా ఏమన్నా? కొనవారిక మీరున్న మాటని మాసి మనము అడుగు

భాగంలో ఏం మాట వుందో అవలీలగా చెప్పగల ఘటికులు! అందుకే — ఓసారి శాంపిల్‌గా నవ్వి — "దుర్గా! పూచిక పుల్లలా వున్నానా? మరి ఏమిటనుకున్నావ్ ప్రకృతి వైద్యమంటే! ఆ ప్రసాదరావుగాడు చెప్పేయగానే నేనేం ఊరికే నమ్మేసేననుకున్నావా? ప్రకృతి వైద్యం మీద బోల్డు పుస్తకాలు చదివేసి మరీ ఆచరణకి పూనుకున్నా... మనలాంటి వాళ్ళకి ప్రకృతి వైద్యం మినహా మరొకటి పడదని నా ఉద్దేశం! మన పిల్లలు చూడు ఎంత స్లిమ్‌గా తయారయేరో!"

"అవునవును, ఇంతకు మునుపే వాళ్ళకి సూపునేరంత కండ లేదు వంట్లో... ఇప్పుడు ఆ 'వైద్యం' పుణ్యమా అని ఎముకల గూడులా అయిపోయేరు... వాళ్ళు పెళ్ళికి కాదండీ పనికొచ్చేది... బతికుండగానే ఏ జూవాలజీ లేబ్‌లోనో - వుంచడానికి పనికొస్తారు!" అంటూ నేను విసురుగా మాటాడేసరికి—

"నువ్వెప్పుడూ ఇంతే - ఏ వైద్యాన్ని ఎప్పుడు నమ్మవు

గనుక!" అంటూ అవతలకి తిరిగి పడుకున్నారు.

ఈయనకి వైద్యాల పిచ్చొకటి - కొన్నాళ్ళు అలోపతీ, కొన్నాళ్ళు ఆయుర్వేదం, కొన్నాళ్ళు హోమియోపతీ, మరికొన్నాళ్ళకి అన్నిటినీ కలిపి ప్రయోగిస్తూ — వుంటారు. ఇప్పుడీ ప్రకృతి వైద్యం! మా అదృష్టంకొద్దీ యునానీ, ఆక్యుపంక్చర్ వైద్యాలు మా గడప తొక్క లేదు. అలాగని నిశ్చింతగా కూడా ఏ మాత్రం నీల్లేదు... ఈ ప్రసాదరావులాంటి వారెవరో ఇక్కడికి రాకనూ పోరు, వాటిని మావారికి వంట పట్టించకనూ పోరు.

ఒక్క మాటలో మావారిని గురించి చెప్పాలంటే - ఆయనకి 'దైవచింతన' కంటే 'దేహచింతన ఎక్కువ.!

మా నాలుగు అల్మారాలలోనూ నిండుగా వున్న పుస్తకాలన్నీ ఏదో ఓ వైద్యానికి సంబంధించినవే. మార్కెట్లో ఏ రకమైన వైద్య పుస్తకం వచ్చినా మరునాటి రోజున మా ఇంట్లో వుండితీరాల్సిందే. ఇక పేపర్లలో... ఏ పేపర్లోనైనా కాన్సర్ గురించి, 'క్షయ'ని గురించి, కళ్ళు జాగ్రత్తల గురించి, పళ్ళ ఇగుళ్ళ గురించి వ్యాసాలు వచ్చాయా! వాటిని జాగ్రత్తగా కత్తిరించి పదిలంగా ఫైలు చేస్తారు. మా అయిదో అల్మారా నిండా ఆ ఫైళ్ళే!

ఓ రోజు ఉదయమే ఉన్నట్టుండి మావారి గొంతు నుంచి పెద్ద గావుకేక వినబడేసరికి చచ్చే చావెరగక తిరగమోత పెడుతున్న దాన్నల్లా పడుతూ లేస్తూ వెళ్ళేను - బయటి గదిలోకి

అద్దం ముందు నిబ్బరంగా నిలుచుని వున్నారు ఆయన!

గుండె దడదడ లాడుతుండగా అలా ప్రశ్నార్థకంగా చూస్తూ వుండిపోయేను.

మావారు అనుమానం, ఆదుర్దా కలగలిసిన స్వరంతో "దుర్గా! మూసేవుటే మెడ దగ్గర వుండే ఈ పుట్టుమచ్చని! దీన్ని నేను ఇన్నాళ్ళ ఎంత నెగ్లెక్ట్ చేశానే!" అన్నారు మెడ మీద వున్న కంది బద్దంత పుట్టుమచ్చని చూపిస్తూ.

"పుట్టుమచ్చని నెగ్లెక్ట్ చేయడమేమిటండీ! అది దాని స్థానంలోనే వుందిగా... ప్రక్కకేమయినా జరిగిందా?"

"నేను చెప్పేదేదీ పూర్తిగా వినవ్! పుట్టుమచ్చలు జరగవుగానీ, అవి పెరిగి పెద్దవయితేనే ఇబ్బందంటాను" అంటూ మెడను జిరాఫీలా సాగించి మళ్ళీ చూపించేరు.

చూసేను—

"ఎలా వుందీ?" అడిగేరు కళ్ళెగరేసి.

"నల్లగా ఉంది."

"నీ మొహం! పుట్టుమచ్చలు నల్లగా కాక తెల్లగా వుంటాయిటే ఎక్కడైనా? అది వెడల్పుగా అయిందేమో చెప్పు!"

"అలాగేమీ అనిపించడం లేదే!"

"బాగా చూడూ... పెసర బద్దంత వుండేది మునుపు... ఇప్పుడు కందిబద్దంత వెడల్పు అయ్యింది!"

"అదేం లేదులేండి... నేను ఎప్పణ్ణుంచో చూస్తున్నా కదా! అంతే ఉంది... అయినా మీకేం నష్టం? కంది బద్దంత కాకపోతే చిక్కుడు బద్దంత కానీ లేండి!"

"ఎంత మూర్ఖురాలవే నువ్వు..." అంటూ కాసేపు వింతగా చూస్తూ— "చదువుకున్నదానివే - ఏ పత్రికలో ఏ వ్యాసం వస్తుందో తెలీదా... నిన్న డైలీలో వచ్చిన వ్యాసం 'కాన్సర్ లక్షణాలు" అన్నది చదివేనా?... అందులో - 'కాన్సర్'ని గుర్తించడానికి కొన్ని పాయింట్లు ఇచ్చేరు. వాటిలో ఓ పాయింటే - 'పుట్టుమచ్చ పెద్దదవుతోంటే కాన్సర్ కావచ్చు' అని వుంది... ఇదీ కాన్సరేమోనే... అదే నాకు అనుమానంగా వుంది" అంటూ మళ్ళీ ఆ మచ్చనే అద్దంలోంచి చూస్తూ వుండిపోయేరు.

"చాల్లేండి మీదంతా చాదస్తం... ఎప్పుడూ ఆ వ్యాసాలు చదవడం ఇలా అనుమానిస్తూ వుండడం... అదేం కాదులే!"

"నీకట్లాగే అనిపిస్తుంది. ఇది కాన్సరయితే అప్పుడు తెలుస్తుంది నీకు. ఇట్లాంటి వాటి విషయంలో నెగ్లెక్ట్ చేస్తే ఇంకేమయినా వుందా! తెలిసి, తెలిసి ప్రాణాలు పోగొట్టుకోడమే!"

ఇంతలో తిరగమోత పొయ్యి మీద పెట్టిన సంగతి జ్ఞాపకం వచ్చి వంటింట్లోకి పరుగుతీశాను.

ఆ రోజు ఆఫీసుకి సెలవు పెట్టేసి డాక్టరు దగ్గరికెళ్ళి ఆ పుట్టుమచ్చ తాలూకు వ్యవహారం కాన్సర్ కాదని నిరూపించుకొన్నదాకా ఆయనకు తృప్తిలేదు. అన్ని టెస్టులకీ, డాక్టరు ఫీజుకీ వంద రూపాయిలు ఖర్చు పెట్టారని తెలిసి ఆ రాత్రి నిద్రపట్టలేదు నాకు.

ఇలా అనుమానాల జబ్బు ఆయన ఒక్కడితోనే అయితే ఏదోలే అనుకోవచ్చు. అయితే, అది మా పిల్లలిద్దరికీ వ్యాపించింది (పెద్దమ్మాయి సుజాతకీ వ్యాపించింది. అయితే — అది ఇక్కడ లేదు... కాబట్టి అది మొగుడి రిస్కు!) ఏ పత్రికలోనైనా 'చెకుముకి' అన్న కొత్త జబ్బు ఆఫ్రికావాళ్ళకో, ఆస్ట్రేలియావాళ్ళకో వచ్చిందని, దాని రోగ లక్షణాలు 'ఫలానా'ని అని వచ్చిందో — మా పిల్లలకి ఆ 'చెకుముకి' జబ్బు మరునాటిరోజే వచ్చేసి వుంటుందంతే! — ఈ వైద్య వ్యాసాలూ, పుస్తకాలు చదివినప్పుడల్లా వాళ్ళ అనుమానాలు మరీ ఎక్కువయిపోతుంటాయి. వాళ్ళకెప్పుడూ చిట్టిపొట్టి రోగాలు వచ్చినట్టు అనిపించవు. చిన్నగా దగ్గు వస్తే అది 'టి.బి.' అయివుంటుంది. కడుపు నొప్పి వస్తే అది 'అల్సర్' అయివుంటుంది. లేదంటే 'అపెండిసైటిస్' అయివుంటుంది. ఎప్పుడైనా జలుబుచేసి గొంతు నొప్పి వస్తే అది గొంతు కాన్సరయి వుంటుంది. ఏదైనా దెబ్బతాలూకు పొక్కు వుండిపోయి తెల్లటి మచ్చ శరీరం మీద ఎక్కడయినా కనబడిందా దానిని గిల్లి, రక్కి, సూదులతో పొడిచి అది కుష్టు కాదని నిర్ధారించుకునిగాని తృప్తిపడరు. ఇంకా ప్రపంచంలో పెద్ద జబ్బు లయిన పక్షవాతం, బ్లడ్ కాన్సర్, ఎయిడ్స్ వగైరాలు కూడా మా పిల్లల దృష్టి నుంచి తప్పించుకోలేవు.

## 2

ఉదయం ఏడు గంటలయింది ...

ఇంట్లో ఉల్లిపాయలు కలికానికైనా లేవు. మార్కెట్టుకి వెళ్లి తెమ్మని చెబుదామంటే మా వారు అయిపు లేరు. 'ఎక్కడి కెళ్ళేరా?' అని వరండాలోనూ, మూడు గదుల్లోను చూసేను. ఊహూ ... కనిపించ లేదు. "ఎక్కడికెళ్ళారింత పొద్దున్నే?" అంటూన్న నా గొణుగుడికి జవాబుగా - "నాన్న పెరట్లో వున్నారని చెప్పింది సుగుణ.



గబగబా పెరట్లోకి వెళ్లి చూద్దును కదా —

గెడ్డానికి సబ్బు పట్టించుకుని షేవ్ చేసుకోడం కోసం రేజర్ని అలా చేత్తో పట్టుకుని శిలా ఎటో చూస్తూ వుండిపోయేరు - ఏదో రేజర్ కంపెనీకి అడ్వర్టయిజ్‌మెంట్‌కు పోజు ఇస్తున్నట్టు.

మా వార్ని అంతగా 'స్టన్' చేసిన దృశ్యమేమిటా అని ఆయన చూస్తున్న వేపు చూశాను. పక్కింటి రామారావు, సరిత వాళ్ళ పిల్లలు వృత్తిక వాలుగేళ్ళ పద్మ పళ్ళు తోముతున్నారు.

"పక్కింటి వాళ్ళు ఎంత సపరివారంగా పళ్ళు తోమితే మాత్రం మీరలా చూడాలా?" అన్నాను.

ఆయన తెప్పరిల్లి ఇంలోకి అప్పుడే వచ్చినట్టు — "చూడవే దుర్గా! వాళ్ళ కుటుంబం ఎంత ముచ్చటగా ..."

"అవును చిన్న కుటుంబం ముచ్చటగానే వుంటుంది!"

"అది కాదే నా పాయింటు. వాళ్ళు పళ్ళు తోమే తీరు..."

ఆయన ఆ మాట అనగానే నా గుండెల్లో పరుగిడుతున్న రైళ్ళు!!!.

"బావుందండీ! పళ్ళు తోమటంలో ఒక తీరూ తెన్నూ ఏముంటుందీ?" అన్నాను పాయింటు దాటవేయాలని.

"అది కాదు దుర్గా! గంట సేపయింది వాళ్ళలా పళ్ళు తోముతూనే వున్నారు. ఆ పసిదానికి తోమిస్తూనే వున్నారు" అన్నారు పరవశంతో


పరుగిడుతోన్న రైళ్ళు 'ఢీ' కొంటున్నట్టు వులిక్కిపడ్డాను. ఏదయితే ఇన్నాళ్ళూ మా వారి కంటపడ కూడదనుకున్నానో అదే కంట పడింది. ఇంకేమిటి మాకు దిక్కు!!!

మా వారికి 'దేహ చింత'నయితే, ఆ రామారావుకి 'దంత చింతన' ప్రధానమైన విషయం. దేహంలో దంతాలూ ఒక భాగమని ఇన్నాళ్ళూ మా వారు గుర్తించకపోవడం మా అదృష్టం. అయితే, ఈనాటితో మా అదృష్టానికి పోగాలం దాపురించింది.

మా వారి కంటే రామారావు పన్నెండాకులు ఎక్కువగానే చదివారు. (ఒక దంతాల విషయంలోనే సుమండీ!) అందరికీ జీవితంలో పళ్ళు తోమడం ఒక కార్యక్రమమైతే, రామారావు ఫ్యామిలీది మాత్రం పళ్ళు తోమడమే జీవితం లాగుంటుంది!

రామారావు తెల్లవారి లేస్తూనే ముగ్గురి టూత్ బ్రష్షుల్నీ ఓ గ్లాసులో నీళ్ళు పోసి అందులో నానబెట్టేస్తారుట. ఓ గంటసేపు అవి బాగా నాని మెత్తబడ్డాక, ఇక అసలు కార్యక్రమం మొదలవుతుందట - ముందు మెత్తటి టూత్ పౌడర్‌తో ఓ అరగంట తోమి, తర్వాత టూత్ పేస్టుని బ్రష్షుల మీదికి ఎక్కించి చకచకా తోమడం మొదలుపెడతారట. అలా ఓ గంటన్నర తోమేక ముగ్గురికీ ఒక్కసారి తృప్తి అనిపిస్తే అప్పుడు ఆ కార్యక్రమానికి స్వస్తి చెప్పి, తర్వాత నాలికని వేళ్లతో ఓ పావుగంట, టంగ్ క్లీనర్‌తో పావు గంట తోమి, రుద్దీ, గీసి ఆ తర్వాత చిగుళ్ళని చూపుడు వేలితో 'మసాజ్' చేస్తారట — మంచి రక్త ప్రసరణ కోసం. ఇలా పూర్తవుతుందన్నమాట వాళ్ళ 'తోముడు కార్యక్రమం'. అంతటితో ఆ రోజు గడిచిపోతుందనుకుంటే పొరపాటే. మళ్ళీ రాత్రి భోజనానంతరం అదే పద్ధతిలో తోమి తరిస్తారట ... ఈ విషయమంతా వారం క్రితం రామారావు భార్య సరితే చెప్పింది. ఆమె అలా చెబుతోంటే నాకు గుండెల్లో దడమొదలయింది. ఇదంతా మా వారికి తెలిస్తే ఇంకేమైనా వుందా నెంకి ఓ వంద రూపాయిలు 'దంత ధావనం' కోసమే ఖర్చు పెట్టెయ్యరూ. ఖర్చు మాటలా వుండనీ గాక 'దంత ధావనం' మీద లెక్చర్లిస్తూ ఎదురుగా మంచుని గంటల కొద్దీ తోమిస్తారు!... అదీ నా భయం!

అయితే ఈ రోజు భయపడ్డంతా అయింది. ఇంకేమిటి చెప్మా మా గతి అనుకుంటూ ఎప్పుడూ పొరపాటునైనా కూడా నా మీద దయచూపని "భగవాన్!"ని ఎందుకైనా మంచిదని స్మరించుకుంటూ - ఏమెరుగని దానికి మళ్లీ అక్కణ్ణించి జారుకున్నాను.




* * *

«ఆదీ తోమడం అంటే అలా వుండాలి అప్పుడే మన పళ్ళు తళతళలాడేది, మన చిగుళ్ళు మిలమిలలాడేది ... ఇన్నాళ్ళూ పళ్ళు తోమడం అంటే ఏమిటో తెలీక ముక్కుబడి తీర్చుకున్నట్టు తోముతున్నాం ... పిన్న రామారావుని అంతా అడిగి తెలుసుకున్నాలే

ఆయన అలా అంటూ పారవశ్యంతో సంచిలోంచి నాలుగు కొత్త టూత్ బ్రష్షులూ, రెండు టూత్ పౌడర్ టిన్నులూ, మూడు పెద్ద టూత్ పేస్టు గొట్టాలు బయటకు తీస్తున్నారు.

"ఇప్పుడివన్నీ ఎవరు తెమ్మన్నారు? ఎంత డబ్బు తగలేసేరండీ...!" అంటూ నేను నెత్తి నోరు బాదుకుంటూంటే —

ఆయన నింపాదిగా నవ్వి - "డియర్ దుర్గా! మన ఆరోగ్యమే మన మహా భాగ్యము ... యు - నో ... ఇన్నాళ్ళూ 'ఒంటి' గురించి మాత్రమే తెలుసుకున్నా, రామారావు పుణ్యమా అని 'పంటి' గురించి కూడా తెలుసుకున్నా!"

'కంటి' గురించి ఏ రామారావూ చెప్పలేదా!" అని గొంతు చించుకుని అరుద్దామనిపించింది. మొండివాడు రాజు కన్నా బలవంతుడట. అరిచీ, అరచి నా నోరు నొప్పించాల్సిందే కాని లేశ మాత్రమైనా ఈ మనిషిలో మార్పు వుండదని తెలిసి గమ్మున వుండిపోయేను.

'సరిత మీద జాలి పడ్డానికి ఇన్నాళ్ళూ నేనైన వున్నాను. ఇప్పుడు నా మీద జాలి పడే ప్రాణి మచ్చుకైనా వుందా ఈ భూ ప్రపంచంలో ... భగవాన్!' అనుకుంటూంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి.

"అసలు రామారావు అంటే ఏమిటో అనుకున్నానే దుర్గా! ప్రతి చిన్న విషయంలోనూ ఎంత శ్రద్ధ వున్నవాడనుకున్నావ్! వాళ్ళమ్మాయి ఎప్పుడయినా చింతపండు అడిగితే వేడినీళ్ళలో శుభ్రంగా కడిగి కానీ ఇవ్వరుట. అసలు వాళ్ళు కాచి చల్లార్చిన నీళ్ళేనట తాగేది. మనమూ ఇక మంచి అలా చేస్తే పోలా" అంటూ ఆయన చెబుతోంటే - అడవుల్లోకి పారిపోతేనా ఆశక్తత మీదా, అసమర్థత మీదా నాకే రోత పుట్టింది.

మా అమ్మాయిలిద్దరూ దిక్కు మొహాలేసుకుని బలి పశువుల్లా నా వేపు చూస్తున్నారు.

3

ఆ రోజు ఆదివారం ...

తెల్లారి లేచిన దగ్గర్నుంచి ఊపిరి సలపకుండా ఒకటే పనుల్లో పడిపోయాం ఇంటిల్లిపాదీ. ఉదయం తొమ్మిది గంటలకి మరక్షణకి పెళ్ళి చూపులకు ధర్మవరం వాళ్ళు వస్తామన్నారు. అందుకే అంత హడావిడి.

గంపెడు క్యారెట్లని కోరుతున్నాను — క్యారెట్ హల్వా కోసం. పెళ్ళి చూపులంటే ఎక్కడైనా ఏ బూందీ లడ్డో, ఏ మైసూర్ పాకో, ఏ జాంగ్రీనో చేస్తారు కానీ, ఇలా క్యారెట్ హల్వాలు ఎక్కడైనా చేస్తారా?

ఆ మాట అంటే మా వారు 'ధాం ధూం' అంటూ నా మీద ఒకటే ఎగురుడు! — "లడ్డూ, మైసూర్ పాకుల్లో ఏమున్నాయి విటమిన్లూ, మినరల్సూ ... క్యారెట్ హల్వాలో ఎన్ని విటమినులున్నాయి ఏం కథ! అసలు కంటి చూపుకి అతి

ప్రధానమైన 'ఏ' విటమిను వుంది" అంటూ ఆయన గ్రంథం విప్పుతోంటే - తెల్ల జెండా ఎత్తేసి ఓటమిని అతి శీఘ్రంగా అంగీకరించేసేను.

తొమ్మిది గంటలకి టంచనుగా పెళ్ళిమావుల వాళ్ళు రానే వచ్చేరు ...

ఎప్పటిలాగే సులక్షణను వాళ్ళ ముందు కూచో బెట్టేం...

పెళ్ళికొడుకు మాడముచ్చటగా చక్కగా వున్నాడు - ఆ కుర్రాడికి ఆంధ్ర బ్యాంకిలో క్యాషియర్‌గా ఉద్యోగమట.

కారెట్ హల్వా తెచ్చి వచ్చిన వాళ్ళందరికీ పంచేను.

"వెరీ నైస్!" అన్నాడు పెళ్ళి కొడుకు హల్వాని రుచి చూసి.

పెళ్ళి కొడుకు అమ్మా, నాన్నా కూడా 'ఆ మాట నిజం' అన్నట్టు తలలు ఆడించేరు.

నేను బోల్డంత సంబరపడిపోయి కారపు బూందీ తేవడానికి వంట ఇంట్లోకి దూరేను. చిన్ని చిన్ని ప్లేట్లలో కారపు బూందీని పోస్తూ వుంటే - "అమ్మా! అమ్మా!!" అంటూ సుగుణ వచ్చింది వగరుస్తూ.

"ఏమే!" అన్నాను తల ఎత్తకుండానే.

"నాన్న ఆ పెళ్ళి వాళ్ళతో క్యారెట్టు ప్రత్యేకతని గురించి మాట్లాడుతున్నారే - పెళ్ళి విషయాలు మర్చిపోయి" అంది.

నెత్తిలో బాంబు పడ్డట్టు ఉలిక్కిపడి ట్రేలో ప్లేట్లను వుంచుకుని బయటగదిలోకి పరిగెత్తుకి వచ్చేశాను.

అప్పటికే ఆయన స్పీచి చాలా తీవ్రస్థాయిలో వుంది.

"... అయితే ఇందాక క్యారెట్టు గురించి కొన్ని ప్రత్యేకతల్ని చెప్పాను అవన్నీ ప్లస్ పాయింట్లన్న మాట. అయితే ఇక్కడ క్యారెట్ వల్ల ఒక గొప్ప మైనస్ పాయింట్ కూడా వుంటోంది. క్యారెట్‌ని విపరీతంగా తినడం వల్ల 'క్యారెట్ రోగం' అని అదేదో జబ్బు వస్తుందట. ఆ జబ్బు పేరు జ్ఞాపకం రావడం లేదు కానీ, మొన్ననే ఓ పత్రికలో వ్యాసం వచ్చింది. మీకు కావాలంటే ఓ అరగంటలో వెతికి చూపించగల్ను. అతి దేనికయినా మంచిది కాదు లెండి..."

"యస్ యస్ మీరు చెప్పింది అక్షరాలా కరక్టే!" అన్నాడు పెళ్ళికొడుకు- హల్వా శకలాల్ని ప్లేట్లో ఎక్కడైనా వుంటే వాటిని స్పూన్‌తో నిర్మూలిస్తూ.

"ఈ ఆపిల్ వుంది చూశారా?" అంటూ టేబుల్ మీద వున్న ఆపిల్ పండును తీసుకుని అందరికీ చూపించేరు మా వారు- గారడీవాడు మాయం చేయబోయే ముందు చూపించినట్టు.

ఇదంతా చూస్తోంటే నాకు ఒకటే బి.పి. పెరుగుతోంది... ఆపిల్ మీద అరగంట, ద్రాక్ష మీద ఓ గంట, అరటి మీద గంటన్నర సేపు అవలీలగా లెక్చరిచ్చేయగలడు నా పతి దేవుడు. అయితే ఇదా సమయం! ఈయన లెక్చరుకి జడుసుకుని ఆ పెళ్ళి మావుల వాళ్ళు ఎక్కడ పరిగెత్తిపోతారోనని నా గుండెలు లయ తప్పి కొట్టుకుంటున్నాయి.

అయితే- ఓ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది.

ఏ నిమిషానికి ఏమి జరుగునో కదా!

పెళ్లికొడుకు అమాంతంగా మా వారి చేతిలో వున్న ఆపిల్‌ని లాగేసుకుని " వుండండుండండి మామగారూ! జస్ట్ వెయిట్... ఈ ఆపిల్ గురించి నాకు చెప్పకండి... ఇదంటే నాకు బ్రహ్మాండమైన ఎలర్జీ... అసలు ఏముంది ఇందులో- పిండి పదార్థం తప్ప.. మూడు రూపాయిలు పెట్టి ఇది తినడం ఒక్కటే ముప్పయి పైసలు పెట్టి ఓ ఉల్లగడ్డని ఉడకేసుకుని తినడం ఒకటే... అని ఆ మధ్య పేపర్లో ఓ వ్యాసం చదివాను. అప్పట్నించి దీన్ని వాసన కూడా చూడను..."

"అవునవును, మా వాడు చెప్పింది కరెక్ట్ సుమండీ!




ఎక్కడో కాశ్మీర్‌లో కాస్తాయి కాబట్టే వీటిపై మనకింత మమకారం... అంతెందుకూ ఈ 'సేవు కాయ'లున్నాయి చూసేరా? 'ఆంధ్ర ఆపిల్స్' అంటారే అని నయం వీటి కంటే. మన ప్రాంతాల్లో పండుతాయి కాబట్టే వాటిని మనం ఆదరించం..." అంటూ పెళ్ళికొడుకు తండ్రి-

"మీరు ఎన్నయినా చెప్పండి- ఈ పళ్ళలో కల్లా నాకు అరటి పండంత గొప్ప పండు మరేదీ కనపడలేదండీ! రాత్రిళ్ళ తింటే చక్కగా జీర్ణమై ఉదయమే అతి చక్కగా విరోచనమౌతుంది. దానికి మరో గొప్ప సుగుణముంది చూశారూ- విరోచనాలు ఎక్కువైతే నిలబెట్టేస్తుంది కూడానూ... ఐలైక్ వెరీమచ్" అంటూ మా వారు-

"యస్ యస్ ఐ టూ ఎగ్రీ విత్ యూ మామగారూ" అంటూ పెళ్ళికొడుకు నవ్వుతూ ఆ బాతాఖానీలో ఓలలాడుతోంటే ఆ మామగారికి తగ్గ అల్లుడే దొరుకుతున్నాడనిపించింది. అయితే ఆ క్షణంలోనే సులక్షణని తలచుకుని దిగులేసింది- 'ఇలాంటి మొగుడు దొరికితే ఏమైపోతుంది ఆ పసిది!" అనుకుంటూంటే అపారమైన జాలేసింది దాని మీద.

అందరూ కారపు బూందీ తినడంలో వుండిపోయేరు.

కాఫీలు యివ్వడానికని వంటింట్లోకి మళ్ళీ దూరేను.

అంతే-

తిరిగి వచ్చేటప్పటికి- టాపిక్ శరీరంలో వివిధ భాగాల మీదికి వెళ్ళింది...

మనిషి శరీరంలో ఎన్ని గ్యాలన్ల నీరుంటుందో మొదలుకొని శరీరంలోని పదార్థాలతో ఏమేమి చేయవచ్చునో చెబుతున్నారు. నేను వినడం మానేశాను.

ఎందుకంటే-

అవన్నీ మాకు కంఠతా వచ్చును. మా రెండో అమ్మాయి సుగుణని అర్ధరాత్రి వేళ లేపి అడిగితే మనిషి శరీరంలో 10 గ్యాలన్ల నీరు వుంటుందని... తక్కిన పదార్థాలతో ఏడు బార్ సోపుల్నీ, 9000 పెన్సిళ్లనీ, 2,200 అగ్గిపుల్లలకి సరిపడా మందే మతాబుని, ఓ పెద్ద బకెట్టుకు సున్నాన్నీ, ఏందు గరిటెడు మెగ్నీషియాన్నీ, రెండు అంగుళాల పొడవున్న తీగ మేకుని తయారు చేయొచ్చు అని చెబుతుంది- నిద్ర మత్తయినా వీడకుండా. మరి ఆయన పెంపకమా? మజాకా?

ఈసారి పెళ్ళి కొడుకు తండ్రి తన 'దేహ చింతన' గురించి ప్రకటించుకుంటున్నాడు. తనకు ఇష్టమైన వైద్యం ఆయుర్వేదమట. అలోపతి అంటే అతనికి గిట్టనే గిట్టదట.

రేపు ఈ పాటికైనా వీళ్ళు దేహ చింతనమూ, వైద్య చింతనమూ వదిలి 'సంసార చింతన'తో పెళ్ళి విషయాలు మాట్లాడుకుంటారా అని నా డౌటు!

నేను రెప్పవేయకుండా ఓ మూడు నిమిషాలు మా వారి వేపు చూసేను- పొరపాటున నా వేపు చూస్తారేమో, పక్కకి పిల్చుకుపోయి రెండు మొత్తటి చివాట్లలో కర్తవ్యం గుర్తుచేద్దామని.

ఊహూ- చూళ్లేదు.

కాఫీ తాగుతూ- అందులో 'కెఫిన్' విషపదార్థమున్నట్టు మా వారు చెబుతోంటే నాకు కోపం నషాళానికి అంటుతోంది. కమ్మగా తాగే దాంట్లో 'విషపదార్థం' వెదుక్కుంటూ కూచున్న వాళ్ళ విజ్ఞానానికి నా నరాల్లో రక్తానికి బదులు కారపు నీళ్ళు ప్రవహిస్తున్నట్టు మండుతోంది.

"ఏమండీ మీ కోసం సూర్యారావు గారువచ్చేరు!" బొంకేను.

"ఏ సూర్యారావు... ఓహో అతనా... రమ్మను దుర్గా!"

"మిమ్మల్నే రమ్మంటున్నారు. ఒక్క మాట మాట్లాడేసి వెళ్ళిపోతార్ట!"

తన సబ్జక్టు సగంలో ఆపేసినందుకు- సారో థర్డ్ క్లాస్ సినిమా చూసినట్టు నా వేపోసారి చూపుల తూపుని

విసిరి వరండాలోకి వచ్చేసారు.

ఆ సమయాన్ని ఏ మాత్రం వేస్టు చేసుకోకుండా పెళ్ళి మాటలు మాత్రమే మాటాడమని 'హింట్' ఇచ్చేను. దాంతో ఆయన నావేపు ఓ చూపు చురచుర చూసి గంటకి రెండు వందల కిలోమీటర్ల నిట్టూర్పు ఒకటి అతి గాఢంగా వదిలి, అర్థమైందన్నట్టు శిరః కంపనంతో తెలిపి అక్కణ్ణుంచి కదిలేరు.

ఆ తర్వాత పెళ్ళి మాటలు సాగేయి. మాతో వియ్యమందుకుంటున్నందుకు వాళ్ళు తృప్తిగాను, మా అమ్మాయిని పెళ్ళి చేసుకోబోతున్నందుకు పెళ్ళికొడుకు మరీ తృప్తిగానూ ఫీలయి వెళ్ళిపోయేరు.

## 4

సాయంత్రం ఐదు గంటలు అయింది...

అప్పుడే కాఫీ తాగేసి అన్నం వండడానికి వంటింట్లోకి దూరేను.

"అమ్మా! అక్కయ్యా, బావా వచ్చేరే!" అంటూ సులక్షణ కేక వినిపించింది.

గబ గబా బయటికి వచ్చేసేను.

రిక్షాలోంచి దిగి వస్తోంది సుజాత- మోహన్ రిక్షా వాడికి డబ్బులిస్తున్నాడు.

సుజాత చంకలోని బాబ్జీ గాణ్ణి సులక్షణ ఎత్తుకుని ముద్దులాడుతోంది. సుగుణ తన చంకలోకి తీసుకోవాలని లాక్కుంటోంది.

మామూలుగా రిక్షా దిగుతున్నట్టే నవ్వులు చిందించే సుజాత మొహంలో దిగులు తొంగి చూస్తుండటం చూసి నాకు ఆందోళన కలిగింది.

"ఏమే ఆరోగ్యం బావులేదా?" ఆత్రంగా అడిగేను- ఎంతయినా నాది తల్లి మనసు మరి. ఎంత మామూలుగా అడగాలని ప్రయత్నించినా ఆందోళన చూస్తోంది నా గొంతులో.

"ఎందుకు బావులేదూ?" అంటూ అది ఎదురు ప్రశ్న వేసింది ఇంట్లోకి అడుగు పెడుతూ.

"మరి ఎందుకలా వున్నావు?"

మోహన్ లోపలికి వచ్చేడు...

"ఏంట్రా! ఏమయిందసలూ? అది అదోలా వుందే?" అడిగేను.

"ఏమని చెప్పేదక్కా! దానికి కొడుకు చింత"

"ఏం... ఏమయ్యింది బాబ్జీగాడికి?" కంగారుగా అడిగేను.

మోహన్ సమాధానం ఇచ్చేలోపల అది ఒక్కటే ఏడుపు మొదలుపెట్టింది.

"ఇదీ వరుస అక్కా!!" అన్నాడు మోహన్ సుజాతని చూపిస్తూ.

"నా గుండెలు లయ తప్పి కొట్టుకోటం ప్రారంభించేయి.

"ఏమయ్యిందిరా!" కీచుబోతున్న కంఠంతో అడిగేను.

"బాబ్జీగాడికి గుండె జబ్బమ్మా!" అంటూ ఏడుపు గొంతుతోటి చెప్పింది సుజాత.

"అదేమిటే విచిత్రంగా చెబుతున్నావు! పేలెడు లేడు వాడికి గుండె జబ్బేమిటి?"

"అదే కదక్కా! నా వాదనామా! వొట్టి పిచ్చిది!" అంటూ వాడు నింపాదిగా సోఫాలో కూలబడి సిగరెట్టు వెలిగించేడు.

సులక్షణ, సుగుణలు బాబ్జీగాడిని పట్టుకుని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుని చూస్తున్నారు- వాడి మొహంలోకి

నేనూ ఆత్రంగా బాబ్జీగాణ్ణి లాక్కుని దిగులుగా చూస్తున్నాను.

"అవును నేను పిచ్చిదాన్నే మీరు మహా తెలివి మంతులు!" అంది సుజాత విసురుగా.

అసలు విషయమేమిటో వివరంగా చెప్పండ్రా!" అన్నాను విసుగ్గా.

"ఏం లేదక్కా! బాబ్జీగాడికి నిన్న రాత్రి కాస్త వళ్ళు వెచ్చనయింది. దాంతో వాడు 'అమ్మా నొప్పి' అంటూ చేతి వేళ్ళు చూపించేడు... ఏదో జ్వరంలో వుండి ఒళ్ళు నొప్పులు వచ్చి వుంటాయి- అట్లా ఆలోచించదే ఈ కూతురు... దీని కన్నీ విపరీతమైన ఆలోచనలు! ఏదో




పత్రికలో చదివిందట 'కీళ్ళవాపులు' వుంటే కీళ్ల నొప్పులు వస్తాయట అవే గుండె జబ్బుకి మూలమట..." అంటూ మోహన్ చెబుతోంటే-

"ఆ మరి? వాడి చేతి వేళ్ళు కూడా వాచాయి. నువ్వయినా చూడవే అమ్మా!" అంది సుజాత బాబ్జీ గాడి చేతివేళ్ళు చూపిస్తూ

అందరూ వాడి చేతి వేళ్ళని పరిశీలించడంలో వుండిపోయాం. నాకేమీ వాడి చేతివేళ్ళు వాచినట్టు అనిపించలేదు.

"అలా ఏమీ అనిపించడం లేదే!" అన్నాను.

"ఏమీ ఎందుకు లేదు... ఇదో ఇంత స్పష్టంగా వాచినట్టు కనిపిస్తోంటేను" అన్నారు సుగుణ, సులక్షణ ముక్తకంఠంతో

"అన్నీ మీ నాన్న పోలికలేనే మీకు" అని మాత్రం అనగలిగేను.

"కరెక్టే అక్కా!" అన్నాడు మోహన్.

"అంతేలే! మీరు ఏది నమ్మేరు గనుక ఇది నమ్మడానికి!" అంటూ అక్కచెల్లెళ్ల తరఫున సుజాత అన్నది.

"సరేలే ఇప్పుడు మునిగిపోయిందేముంది, పిల్లల డాక్టరు దగ్గరికి తీసికెళ్దాం పదండి!" అన్నాను.

ఈలోగా మా వారు రావడం- ఇదంతా విని తెగ కంగారు పడిపోయి డాక్టరు దగ్గరికి వెళ్ళడంలో ఆలస్యం చేసినందుకు మా అందరికీ విడివిడిగాను, ఉమ్మడిగాను చివాట్లు వడ్డించడం జరిగేయి.

* * * *

"అమ్మాయ్! నువ్వొట్టి కంగారు మనిషివి. వీడికేం గుండెజబ్బమ్మా! రుబ్బురు గుండులా వుంటేనూ..." అంటూ నవ్వేడు డాక్టరు బాబ్జీగాణ్ని పరీక్షించేక.

"హమ్మయ్య!!!" అంటూ గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాం.

"జ్వరం లేదా డాక్టర్! ఇంకేదయినా ట్రీట్‌మెంట్..." అంది సుజాత.

"ట్రీట్‌మెంట్ వాడిక్కాదమ్మా! నీకివ్వాలి- లేని పోని అనుమానాలతో కుమిలిపోకుండా!" అన్నాడు డాక్టరు నవ్వుతూనే.

అప్పుడు నవ్వింది సుజాత నిండుగా!

అందరం బయటికొచ్చేక మా వారు అన్నారు కదా..

"ఈ డాక్టరుకేం తెలిదమ్మా... గొప్ప గొప్ప డాక్టర్లు కూడా రోగాన్ని కనిపెట్టడంలో పొరబడుతుంటారు... అది కీళ్ళ జబ్బే అయితే ఎంత ప్రమాదం, ఏం కథ! మరో డాక్టర్ని కన్సల్ట్ అవుదామా?"

నాకు చిర్రెత్తుకొచ్చింది. "బావున్నారండీ మీ తండ్రీ కూతుళ్ళు. చిల్డ్రన్ స్పెషలిస్ట్‌ని కూడా నమ్మక పోతే ఎలా? చాలు చాల్లెండి. ఇంటికెళ్దాం పదండి" అన్నాను.

మోహను కూడా నాకే సపోర్టుగా మాట్లాడ్డంతో అంతా ఇంటి దారి పట్టాం.

## 5

"దుర్గా! దుర్గా!!" మా వారు బయటి గదిలోంచి కేకలు పెడుతున్నారు. పెరట్లో బట్టలుతుకుతున్న దాన్నల్లా నిబ్బరంగా సబ్బు చేతిని కడిగేసుకుని వెళ్లాను- తడి చేతిని కొంగుకి వత్తుకుంటూ.

"ఏం చేస్తున్నావ్ పెరట్లో! ఎంతసేపు పిలవాలి నిన్ను?" అన్నారు నా పతిదేవుడు అసహనంగా.

"కూరగాయలు తరుగుతున్నా"

అని చెప్పాలని పించింది.

వెంటనే పతి దేవుడితో జోకులు వేయడం పతి ధర్మాల్లో విరుద్ధాంశంగా గుర్తించి "ఏం లేదు బట్టలు" అన్నాను ఉతుకుతున్నట్టు చేత్తో అభినయిస్తూ.

ఈ సంతోషం. గొప్ప పనే... అసలు ఈ రోజు పేపరు చూసేవా?"

'చూళ్ళేదు!"

"బ్యాకోడర్మా మీద చక్కటి వ్యాసం వచ్చిందే!"

'దర్మా ఏమిటి బర్మా లాగా?' అనుకుని - "అదేమిటండీ? ఏదయినా పనిముట్టు కనిపెట్టారా?" అన్నాను అయోమయంగా మొహం పెట్టి.

"ఏ తంకాయ్! నువ్వు బి.ఏ. చదివావు కానీ నీ తలలో మెదడు పెరగలేదు. ఇన్నేళ్ళా నాతో కాపురం చేసేక నీకు ఏం వచ్చిందనీ? పూలకి కట్టిన దారానికీ, ఇంగువ చుట్టిన గుడ్డకీ వాటి వాసన అబ్బుతుందంటారే మరి నీకూ? నా సాహచర్యంలో నీకీ ఇన్నాళ్ళకి 'వైద్య జ్ఞానం' వస్తుందా అంట!"

"అసలు విషయం చెప్పండి సార్! నా బి.ఎ. చదువులో ఈ 'బ్యాకోడర్మా'లూ, గీకోడర్మాల గురించి చదువుకోలేదు... ఏదో తెలుగు లిటరేచర్ కాస్త, హిస్టరీ, పాలిటిక్స్ కాస్త కాస్త చదువుకున్నా.."

"బ్యాకోడర్మా అంటే- 'బొల్లి'. తెలుగులో దాని




శాస్త్రీయ నామం 'శ్వేత కుష్టు' అంటారు- అదన్న మాట!"

"అదయితే ఏమిటంట గా!??"

"ఏమిటంటా అంటే ఏం చెప్పనే దుర్గా... బ్యాకోడర్మాకు యూనానీ వైద్యంలో మంచి మందు వుందట... అదే- ఈ వ్యాసంలోని సారాంశం ఇప్పటికి చాలా కేసులు నయమయ్యాయట... "

"అయితే ఏంటండీ... మనకెవరికీ 'బొల్లి' లేదుగా!"

"ఛ!ఛ! నీ లైఫే వేస్టు... ఇలాంటి వ్యాసాల్లో ఎంత విజ్ఞానం వుంటుందీ, ఏం కథ...! మేము ఇన్నాళ్ళూ 'యునానీ' వైద్యాన్ని ఎంత నెగ్లక్ట్ చేసేము... అను కుంటే దిగులేస్తోంది."

"దిగులు పడకండి! వాటి మీద పుస్తకాలుంటాయి తెప్పించండి! అదేదో చైనా వైద్యం ఒకటి వుందిగా 'ఆక్యుపంక్చరు' అని... అదీ మరచిపోకండి. వాటి మీద పుస్తకాలుంటాయి అవి తెప్పించండి... అన్నీ తెప్పించి మా పైన రుద్దండి!!!" అన్నాను ఆవేశంలో- నా నరనరాల్లో పొంగుతున్న కోపానికి తెలుగు రూపం ఇస్తూ-

"ఏమిటో నీ అనసూయా... ఈ నవీన కాలంలో అన్ని వైద్యాలూ ఎంత ప్రగతిని సాధిస్తున్నాయో ఏం కథ... అది ఏ వైద్యమైనా మానవాళి శ్రేయస్సుకేగా!" అన్నారాయన అయోమయంగా మొహం పెట్టి.

మమ్మల్ని ఇక ఏ దేవుడూ రక్షించలేడన్న విషయం స్పష్టమైపోయింది నాకు... అలా నిలువు గుడ్లేసుకుని శూన్యంలోకి చూస్తుండిపోయాను.

దీపావళి శుభాకాంక్షలతో!

షా అమీచంద్
తారాచంద్ అండ్ కం.,

పోస్టు బాక్స్ నెం. 120, నందిపాటివారి వీధి,
విజయవాడ - 520 001

ఫోన్ నెం. 73456

హోల్ సేలర్స్:

బళ్ళార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్
యమునానగర్
"AMIR" బ్రాండ్ ఎన్‌వలప్స్, ఫైల్స్, విజిటింగ్ కార్డులనే
ఎల్లప్పుడు ఉపయోగించండి.

Whole Saler for:
భోర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, బొంబాయి

Sister Concern:
అమీచంద్ పేపరు కంపెనీ